క్లుప్తంగా

దుస్తుల పంపిణీ

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది యువ కబడ్డీ క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు కావటి నగేశ్ శుక్రవారం దుస్తులు పంపిణీ చేసి ఔదార్యం చాటారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు చెరుకు రవి, మోదుగు శ్రీనివాస్, యెడ్ల శ్రీనివాస్, సింగపురం అఖిల్, గుర్రాల అయ్యప్ప, జీడికంటి సాయి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శనతో అవగాహన



పాలకుర్తి: కార్యాలయాలు, ఆలయాలను సందర్శిసే అవగాహన పెరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ రాకేశ్‌లు అన్నారు. శుక్రవారం దుబ్బతండా(కె) పాఠశాల విద్యార్థులు తహసీల్దార్, వల్మిడి, సోమేశ్వరాలయం, పాలకుర్తి పోలీస్‌స్టేషన్, జిల్లాపరిషత్ పాఠశాల, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత ఇన్‌చార్జ్‌లు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం శేషగిరి రావు, ఉపాధ్యాయులు అనిల్, ఎస్.నవదీప్ కుమార్ పాల్గొన్నారు.

‘స్పెషలాఫీసర్, కార్యదర్శిని బదిలీ చేయాలి’



కొడకండ్ల: పెద్దబాయితండా పంచాయతీ కార్యదర్శి సోమేశ్ నిధులు దుర్వినియోగం చేస్తూ విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నా ప్రత్యేక అధికారి పట్టించుకోవడం లేదని వారిని బదిలీ చేయాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓను కోరుతూ శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. భాస్కర్, లక్‌పతి, పాండ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ రూరల్: అంబేడ్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్‌ని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో బండి సంజయ్‌ని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వెంటనే ఆయన స్పందించి కేంద్ర ఆర్థిక శాఖకు లేఖ రాసినట్లు పరశురామ్ తెలిపారు. ఆయన వెంట రామకృష్ణ ఉన్నారు.

ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధం

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని జామాయిల్ తోట దగ్ధమైన ఘటన ఆలింపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దండ్యాల కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, భీంరెడ్డి వెంకట్‌రెడ్డిలు ఆరు ఎకరాల్లో జామాయిల్ తోటను సాగు చేశారు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని తోట మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనలో రూ. 3.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జనగామ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన అనిల్

బచ్చన్నపేట: రోడ్డు ప్రమాదంలో కట్కూర్ గ్రామానికి చెందిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామం హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దోకి అనిల్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం గురువారం కట్కూర్‌కు వచ్చాడు. పనిమీద బైక్‌పై చేర్యాలకు వెళ్లి కట్కూర్‌కు వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

ఆర్‌ఓబీ అయ్యేనా..?



రఘునాథపల్లి-కంచనపల్లి రైల్వే గేట్ పడటంతో నిరీక్షిస్తున్న వాహనదారులు

- సర్వేలకే పరిమితం అవుతున్న పరిస్థితి
- రఘునాథపల్లి రైల్వే గేటు వద్ద నిత్యం నిరీక్షణే
- ఆస్పత్రికీ సకాలంలో వెళ్లలేని దుస్థితి
- ప్రధాన మార్గం కావడంతో ఇబ్బందులు

రఘునాథపల్లి: రఘునాథపల్లి-కంచనపల్లి రహదారిపై ఉన్న రైల్వే గేట్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ప్రజలు పాలకుర్తి, తొర్రూరు, ఖమ్మం వెళ్లేందుకు ప్రధాన మార్గం కావడం.. రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద నిరీక్షించాల్సి వస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. లెవల్ క్రాసింగ్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణం సర్వేలకే పరిమితమైంది. సంబంధిత విభాగాలు ఈ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదు. కాజీపేట-సికింద్రాబాద్ రైల్వే జంక్షన్ల నుంచి నిత్యం ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లు ఈ ట్రాక్‌పై రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి 10 నుంచి 15 నిమిషాలకు ఒక రైలు వెళ్తుంది. ఈ క్రమంలో కంచనపల్లి రైల్వే గేట్ తరచూ మూసి ఉండటంతో ఒక్కోసారి 15 నిమిషాల నుంచి 20 నిమిషాల వరకు వేచి చూడాల్సి వస్తోంది. సాంకేతిక, ఇతరత్రా కారణాలతో గేట్ మరమ్మతు చేయాల్సి వచ్చిన సమయంలో వాహనాలు ఇరువైపులా భారీగా నిలిచిపోతున్నాయి.

సకాలంలో చికిత్స అందక..

రఘునాథపల్లిలోని అన్ని గ్రామాలతోపాటు జనగామ నుంచి కూడా పాలకుర్తి, తొర్రూరు వైపు వెళ్లే వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. కంచనపల్లి, గబ్బెట, రామన్నగూడెం, కోడూరు తదితర గ్రామాల నుంచి అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆపద సమయంలో అంబులెన్స్ రావాలన్నా.. వెళ్లాలన్నా.. గేటు వద్ద నిరీక్షించాల్సి రావడంతో రోగుల పరిస్థితి ఒక్కోసారి విషమిస్తోంది. సకాలంలో ఆస్పత్రికి వెళ్లక ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. గతంలో ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులు క్షేత్రస్థాయిలో బ్రిడ్జి నిర్మాణం కోసం సాయిల్ (భూపరీక్షలు) సైతం చేశారు. అనంతరం ఆ విషయాన్ని విస్మరించారు. లెవల్ క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, మంత్రులకు పలు గ్రామాల ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. రైల్వే, ఇతర విభాగాల అధికారుల దృష్టికీ విషయాన్ని తీసుకెళ్లారు. అయినా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. ప్రజల సౌకర్యార్థం అధికారులు, పాలకులు స్పందించి ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించి ఇబ్బందులను తీర్చాలని పౌరులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రంలోని రైల్వే గేట్‌తో ఇబ్బందులు పడుతున్నాం. మరోదారి లేక నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. రైళ్లు వచ్చే సమయంలో గేటు మూసి ఉండడంతో అత్యవసర వైద్యం కోసం సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేకపోతున్నాం. వివిధ అవసరాల కోసం మండల, జిల్లా కేంద్రానికి, నిత్యావసరాల కోసం వెళ్లేందుకూ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి రెండు లైన్లలో రైళ్లు వస్తే పావుగంటకు పైగా వేచి ఉండాల్సి వస్తోంది.

– గూడెల్లి సురేష్, గబ్బెట

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



రైల్వే గేట్ పడితే నిత్యం నిరీక్షించాల్సి వస్తోంది. ఏళ్లుగా ప్రజలు కష్టాలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోజు రోజుకూ ఈ మార్గంలో వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా ఎందుకు పట్టించుకుంటలేరో అర్థం కావడం లేదు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకూ సకాలంలో చేరుకోలేకపోతున్నారు.

– కొలిపాక మల్లేష్, కంచనపల్లి

యాసంగి పంటలకు సాగు నీరందించాలి

రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు సాయన్న



మాట్లాడుతున్న సాయన్న

రఘునాథపల్లి: యాసంగిలో సాగు చేసిన పంటలకు సాగు నీరందించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఆది సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ముప్పిడి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం ద్వితీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండంలోని మేకలగట్టు మేకలమ్మ చెరువు, ఖిలాషాపూర్ పటేల్ చెరువులలో నీళ్ల లేక భూగర్భజలాలు అడుగంటి బావులు, బోర్లలో నీరు లేక పంటలు ఎండుతున్నాయన్నారు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. బొమ్మకూరు రిజర్వాయర్ ద్వారా మేకలగట్టు, ఖిలాషాపూర్ పటేల్ చెరువులను గోదావరి జలాలతో నింపి పంటలు కాపాడాలని కోరారు. అనంతరం మండల రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఇటుకాల హన్మాజీ, అధ్యక్షుడు ముప్పిడి ఎల్లయ్య, కార్యదర్శి సాధన అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చొప్పరి సోమన్న, నాయకులు కంబాల వెంకన్న, రామగుండం దశరథ, సురుగు రమేష్, కావటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత



సరుకులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

జనగామ: పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన ఎక్కలదేవి యాదగిరి జ్ఞాపకార్థం కుమారుడు వెంకటేశ్వర్ల సహకారంతో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం అధ్యక్షుడు గాదె నర్సింహులు ఆధ్వర్యంలో వర్ధన్, రాజేశ్వరి వృద్ధాశ్రమాల్లో రూ.10వేల విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రవీణ్ కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి, సుమన్, లక్ష్మణ్‌దాస్, లక్ష్మి, రవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

జఫర్‌గఢ్: మండలంలో చేపట్టిన దేవాదుల కాల్వ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం చేపట్టిన దేవాదుల కాల్వ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కాల్వల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఎండీ యాకుబ్‌పాష, మంద బుచ్చయ్య, సమ్మయ్య, ఎండీ జాఫర్, సాయిలు, దూడయ్య, ముసలయ్య పాల్గొన్నారు.

సమయపాలనలో నిర్లక్ష్యం

నర్మెట: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్ టీచర్ సమయ పాలన పాటించడం లేదని కేంద్రాన్ని ఆలస్యంగా తీస్తున్నదని చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్ ప్రజ్ఞాపురం రజిత, ఆయా రాజమణి ఉదయం 10 గంటల వరకు కూడా తీయకపోవడం, కనీసం ఆయా కూడా లేకపోవడంతో కేంద్రానికి వచ్చిన చిన్నారులు బయటే కూర్చుని రోదించారు. కాగా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతను వివరణ కోరగా అంగన్‌వాడీ టీచర్‌కు జ్వరం రావడంతో సెలవులో ఉన్నారని, ఆయా వచ్చి ఆమెకూ జ్వరం వచ్చి వెళ్లిపోయిందన్నారు. ఇద్దరి మధ్య సమన్వయ లోపంతో ఇలా జరిగిందని తెలిపారు.

యూటీఎఫ్, సీపీఎం ప్రచారం

దేవరుప్పుల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలుపు కోసం టీఎస్‌యూటీఎఫ్, సీపీఎం వేర్వేరుగా శుక్రవారం విస్తృత ప్రచారం చేపట్టింది. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్, సీపీఎం జిల్లా నాయకుడు సింగారపు రమేశ్ మాట్లాడుతూ నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యతతో ఓటేసి గెలిపించాలని కోరారు.

నియామకం

చిల్పూరు: భూ మాత రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన దేవి తిరుపతిరెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య యాదవ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మాతృభాష గొప్పదనం చాటుదాం



జనగామ: కథల పుస్తకం అందజేస్తున్న హెచ్‌ఎం వేణు



తరిగొప్పుల: వివిధ వేషధారణల్లో విద్యార్థినులు



బచ్చన్నపేటలో..



దేవరుప్పుల: ప్రశాంతి విద్యానికేతన్‌లో..

- హెచ్‌ఎం వేణు

జనగామ: మాతృభాష గొప్పదనాన్ని చాటుదామని నర్మెట మండలకేంద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలం వేణు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యాన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భాషా అంశాలను తెలియజేసే విధంగా చేపట్టిన ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. సాహిత్యాంశాల్లో ప్రత్యేకత కలిగిన చిత్ర కవిత్వం, సరిగమల పద్యం ఏకాక్షర వాక్యాలు, కవుల చిత్రపటాలను పిల్లలు ఆసక్తిగా గమనించారు. కొంత మంది విద్యార్థులు వాటిని ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. పొడుపు కథలు, సామెతలు, అచ్చ తెలుగులో మాట్లాడడం, తెలంగాణ పదాలు, పద్య పఠనం, తదితర అంశాలతో కూడిన క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం సమయసారిణి, వ్యస్తాక్షరి పదాలతో అంత్యాక్షరి నిర్వహించి, ఆయా కేటగిరీల్లో గెలుపొందిన వారికి పెద్ద బాలశిక్ష, నీతి కథల పుస్తకాలను బహుమతిగా అందజేశారు. అంతకు ముందు వృద్ధ రైతు, వృద్ధ మహిళను వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించి సత్కరించారు.



రఘునాథపల్లి: మాతృభాషపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మధురమైనది మాతృభాష

రఘునాథపల్లి: తల్లిపాల లాంటి స్వచ్ఛమైనది, మధురమైనది మాతృభాష అని మండలంలోని కోమళ్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జాన్‌సుందర్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులతో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లకార్డులతో మాతృభాషపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ కవుల వేశధారణలో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

అన్ని భాషల్లోకెల్లా మాతృభాష గొప్పది

దేవరుప్పుల: అన్ని భాషల్లోకెల్లా మాతృభాష గొప్పదని ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాష ఉద్యమ కారుడు గిడుగు వెంకట రామ్మూర్తి, కాళోజీ నారాయణరావు చిత్రపటాలకు పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఉపాధ్యాయులు గాదర బోయిన లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

తరిగొప్పుల: సోలిపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ కవుల వేషధారణలు, నాటికలు, నృత్యప్రదర్శనలు, పాటలు, పద్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు గుళ్లపల్లి పద్మజ, సారంగపాణి, బ్యంగి కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పులి సరోత్తంరెడ్డికి పట్టం కట్టండి



ఆచారిని సన్మానిస్తున్న నాయకులు

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

జనగామ రూరల్/బచ్చన్నపేట/తరిగొప్పుల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం బచ్చన్నపేట, తరిగొప్పుల మండల కేంద్రాల్లోని రామకృష్ణ విద్యాలయం, సెకండరీ పాఠశాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తమ్‌రెడ్డిని గెలిపిస్తే ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమంల్లో మాజీ మంత్రి గుండె విజయ రామారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి, ఉడుగుల రమేష్, బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభారి నాగపురి రాజమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్, పట్టణ అధ్యక్షుడు అనిల్, బేజాడి బీరప్ప, బళ్ల శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, దొంతుల చంద్రమౌళి పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, శ్రీకాంత్, సంపత్ తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

లింగాలఘణపురం: మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 58 మంది యువకులు రక్తదానం చేయగా జనగామ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్, దివ్య, టెక్నీషియన్ రాజు, నర్సింగ్ ఆఫీసర్ రషీద్, సిబ్బంది రక్త యూనిట్లను సేకరించారు. ఈ జీడికల్ దేవస్థాన చైర్మన్ మూర్తి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, విజయ్‌భాస్కర్, మోహన్, నాగేందర్, గణపతి, అంజనేయులు పాల్గొన్నారు.

భవిష్యత్ లక్ష్యంతో ముందడుగు వేయాలి



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కొడకండ్ల: విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందడుగు వేయాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సమావేశంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు సేఫ్టీ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై చింత రాజు, పోలీస్ సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ రోడ్డులో అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాటి దీక్షను ఐద్వా పట్టణ నాయకురాలు శివరాత్రి హేమలత ప్రారంభించి మాట్లాడారు. సుగుణ, సుజాత, భవాని తదితరులు పాల్గొన్నారు.

త్రికూటాలయానికి విద్యుత్ వెలుగులు





చిల్పూరు: యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యంచేస్తారనే నానుడిని నిజం చేశారు మండలంలోని రాజవరం గ్రామ యువత. కాకతీయుల కాలంలో నిర్మించిన త్రికూటాలయం చెట్లపొదలతో నిండి శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామ యువకులు చరిత్రకు సాక్షంగా ఉన్న త్రికూటాలయ పరిరక్షణకు ముందుకు వచ్చారు. దేవాలయం చుట్టూ ఉన్న చెట్ల పొదలను కన్నెబోయిన అశోక్, కందికొండ అనీల్ ఆధ్వర్యంలో 30 మంది యువకులు నెల రోజుల నుంచి కష్టపడి ఆలయ ప్రాంగణం శుభ్రం చేశారు. అనంతరం దేవాలయానికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. శివరాత్రి వరకు భక్తులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ప్రశాంత్, రవి, శ్రీకాంత్, అరవింద్, గణేశ్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి

దేవరుప్పుల: సంక్షేమ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థుల అభ్యున్నతి కోసం నిర్వాహకులు పాటుపడాలని తహసీల్దార్ ఎం.మహిపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ రికార్డులు, పరిసరాలు, వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం బాలికలతో కలిసి భోజన చేశారు. ఇన్‌చార్జ్ అధికారి భవానీతో హాస్టల్‌లో నెలకొన్న స్థితిగతులపై సమీక్షించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్లలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైభవంగా తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల మండలి, కార్య నిర్వాహక సమితి ఆధ్వర్యంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వార్లకు నూతన వస్త్రాలను అలంకరించి, ఆలయం ముందు ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపైకి తీసుకువచ్చారు. వేద పండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలతో స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం గరుడవాహనంలో ఊరేగింపు నిర్వహించారు. శనివారం మహాపూర్ణాహుతి, అవబృద స్నానం, రాత్రి పుష్పయాగం, ధ్వజావరోహణం వంటి కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి వేద పండితులు ఉత్తలూరు అనిల్ బాబు, దరిపల్లి కిషోర్, సురేష్, లక్ష్మణాచార్యులు, గ్రామ పెద్దలు పానుగంటి గోపాలకిషన్‌రావు, సుల్తాన్ నర్సింహారెడ్డి, పెంట గట్టుమల్లు, పానుగంటి కొనారావు, వెంకటేష్‌యాదవ్, అవదూత శ్రీనివాస్, గోళి సంతోష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నియోజవకర్గ పరిధిలోని గోవర్ధనగిరి దర్గా వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తాము బాల్యంలో చేసిన చిలిపిపనులు, బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆద్యంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.